సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం ; 21 ; జూలై ; 2023



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట @ రూ.107

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.107, కనిష్టంగా రూ.55 పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
32.4°/21.9°

జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 12 టీఎంసీల నీరు



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్‌: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 12.574 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు టీబీ బోర్డు అధికారులు వెల్లడించారు. డ్యాంలో 1,633 అడుగులకు నీటి మట్టానికి 1,591.77 అడుగులకు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు. ప్రస్తుతం 12.574 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 9,536 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 245 క్యూసెక్కులుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,631.53 అడుగులతో 99.937 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. 1,48,159 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,28,247 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

గుంతకల్లు డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడుపుదాం



వెంకటరమణారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్‌ఎం మనీష్‌ అగర్వాల్‌

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉద్యోగులు సహకరించాలని నూతన డీఆర్‌ఎం మనీష్‌ అగర్వాల్‌ కోరారు. గురువారం నూతన డీఆర్‌ఎం అగర్వాల్‌ ప్రస్తుత డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డివిజన్‌ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అంతకముందు నూతన డీఆర్‌ఎం అగర్వాల్‌ను ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పీఎం యశస్వి స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్‌: ఇంటర్‌ ప్రథమ , ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు ప్రధాన మంత్రి యశస్వి స్కాలర్‌షిప్‌ పథకానికి ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదన్నారు. నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ ఈ ఏడాది సెప్టెంబర్‌ 29న ప్రధాన మంత్రి యశస్వి పరీక్ష – 2023 నిర్వహిస్తుందన్నారు. అనంతరం ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన వివరాలను https://yet.nts.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం సెంట్రల్‌ పాపులేషన్‌ రీసెర్చ్‌ బృందం పరిశీలించింది. ఆస్పత్రిలోని ఓపీడీ, ఐపీడీ, ల్యాబ్‌, ఫార్మసీ, కాన్పులు, గర్భిణులు, బాలింతలకు అందించే వైద్య సేవలు, చిన్నపిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు సునీల్‌ కుమార్‌, అనిల్‌కుమార్‌, కుళ్లాయప్ప నాయక్‌, లింగా రామమోహన్‌ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

పుట్టపర్తి: సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం దూపంపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలు రక్తహీనత బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

బ్రాండ్‌ దోపిడీ!



- పుట్టపర్తిలోని గోవిందపేటకు చెందిన ఈశ్వరమ్మ అనే 56 ఏళ్ల మహిళ సత్యమ్మ సర్కిల్‌లో ఉన్న ఓ మొబైల్‌ దుకాణంలో రూ.2,100 వెచ్చించి నోకియా ఫోన్‌ తీసుకుంది. అయితే నాలుగు రోజులకే పాడైపోయింది. వెంటనే దుకాణంలో సంప్రదించగా సిబ్బంది లేరు.. పది రోజుల తర్వాత రమ్మని చెప్పారు. అంతలోపు మరో దుకాణంలో రిపేర్‌కి ఇవ్వగా.. నోకియా ఫోన్‌ కాదని గుర్తించారు. చైనా సాఫ్ట్‌వేర్‌ ఉందని తేల్చారు.
- ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నారాయణప్ప అనే 53 ఏళ్ల వ్యక్తి కొత్తచెరువు సర్కిల్‌లో ఉన్న ఓ మొబైల్‌ దుకాణంలో రూ.1,650 పెట్టి ఓ ఫోన్‌ కొన్నాడు. వారం రోజులకే పని చేయలేదు. అదే షాపుకెళ్లి అడగ్గా.. గ్యారంటీ ఇవ్వలేదని దబాయించారు. మరో దుకాణంలోకి వెళ్లగా.. నోకియా కాదని.. చైనా మదర్‌ బోర్డు ఉందని చెప్పడంతో బాధితుడు లబోదిబోమంటున్నారు.
- పెనుకొండలోని కోట వీధిలో నివాసం ఉంటోన్న ఓ కూలి.. బస్టాండు సమీపంలో ఉన్న ఓ మొబైల్‌ దుకాణంలో రూ.2,500 వెచ్చించి శామ్‌సంగ్‌ కీప్యాడ్‌ ఫోన్‌ కొనుగోలు చేశాడు. నాలుగు రోజులకే పాడైపోయింది. దగ్గరలో ఉన్న ఓ సర్వీస్‌ సెంటర్‌లో చూపించాడు. శామ్‌సంగ్‌ స్టిక్కర్‌ ఉన్నప్పటికీ.. లోపల చైనా సాఫ్ట్‌వేర్‌ ఉందని.. అందుకే పని చేయడం లేదని మెకానిక్‌ చెప్పాడు. దీంతో మోసపోయినట్లు కూలీ వాపోయాడు.

- చైనా బోర్డులతో చీప్‌ సెల్‌ఫోన్లు
- బ్రాండ్‌ స్టిక్కర్లు వేసి జోరుగా అమ్మకాలు
- సమస్యలొస్తుండటంతో లబోదిబోమంటున్న వినియోగదారులు
- పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణాల్లో వెలుగులోకి..



సాక్షి, పుట్టపర్తి: అమాయకులు, వృద్ధులు, నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకుని మొబైళ్ల విక్రయాల్లో నయా దందాకు తెరలేపారు కొందరు వ్యాపారులు. మొబైల్‌ ఫోన్లకు పైన బ్రాండెడ్‌ స్టిక్కర్లు అతికించి నైస్‌గా అమ్మేస్తున్నారు. అయితే వారం రోజుల వ్యవధిలోనే అవి చెడిపోతుండటంతో వినియోగదారులు అదే దుకాణాలకు వెళ్తున్నారు. గ్యారంటీ ఉన్నప్పటికీ తమ వద్ద పని చేసే సిబ్బంది సెలవులో ఉన్నారని పది రోజుల తర్వాత రావాలని వారు చెబుతున్నారు. అప్పటి వరకు ఉండలేక ఇతర దుకాణాలకు రిపేరి కోసం వెళ్తున్నారు. అక్కడ మొబైల్‌ చూపించగా.. ఇవన్నీ చైనా బోర్డు ఫోన్లని చెబుతుండటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఆ తర్వాత విక్రయించిన దుకాణదారుడిని అడిగితే.. మరమ్మతులకు ఇచ్చిన దగ్గర మార్చేశారేమో.. తాము గ్యారంటీ వస్తువులనే అమ్మినట్లు దబాయిస్తున్నారు. ఇలాంటి సమస్యలు పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం, పెనుకొండ పట్టణాల్లో ఇటీవల కాలంలో ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి.

వృద్ధులపైనే ప్రతాపం

స్మార్ట్‌ ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు 'స్మార్ట్‌'గా బతికేస్తున్నారు. అయితే 50 ఏళ్లు పైబడిన వాళ్లు.. పల్లెవాసులు, నిరక్షరాస్యులు కీప్యాడ్‌ ఫోన్లనే వినియోగిస్తున్నారు. అలాంటి వారు నేరుగా మొబైల్‌ షాపులోకి వెళ్లగానే వారి అమాయకత్వాన్ని నిర్వాహకులు పసి గట్టేస్తున్నారు. డమ్మీ ఫోన్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సర్టిఫికెట్‌ తేవాలంటూ రుబాబు

స్మార్ట్‌ ఫోన్లను చాలామంది ఆన్‌లైన్‌ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. అయితే కొందరు నేరుగా మొబైల్‌ షాపులో వెళ్లి కొంటున్నారు. కానీ కీప్యాడ్‌ ఫోన్లు కొనుగోళ్లు దాదాపు ఆఫ్‌లైన్‌ ద్వారానే ఉంటున్నాయి. దీంతో కొందరు మొబైల్‌ షాపు నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. బ్రాండెడ్‌ ఫోన్‌ ఎందుకు ఇవ్వలేదని వినియోగదారులు ప్రశ్నిస్తే.. 'నీకు బ్రాండ్‌ కాదని ఎవరు చెప్పారో.. అక్కడి నుంచి సర్టిఫికెట్‌ తీసుకురా' అంటూ షాపు నిర్వాహకులు రుబాబు చేస్తున్నారని వాపోతున్నారు.

పైన పటారం.. లోన లొటారం

మొబైల్‌ ప్యాకింగ్‌పైన నోకియా, శామ్‌సంగ్‌ స్టిక్కర్‌ ఉంటుంది. మొబైల్‌ డిస్‌ప్లే కూడా అలాగే కనిపిస్తుంది. కానీ సాఫ్ట్‌వేర్‌ మాత్రం చైనా కంపెనీగా తేలుతోంది. దీంతో కీప్యాడ్‌ వినియోగదారులు పలు విధాలుగా మోసపోతున్నారు. పదే పదే దుకాణాల చుట్టూ తిరగలేక మరో ఫోన్‌ కొనుగోలు చేస్తున్నారు.

> **అప్రమత్తంగా ఉండాలి**
>
> ఏదైనా వస్తువు కొనుగోలు చేసే ముందు బ్రాండ్‌తో పాటు ఐఎస్‌ఐ గుర్తింపు ఉందో.. లేదో చూసుకోవాలి. వస్తువు ఉత్పత్తి చేసిన తేదీని గమనించాలి. అలాగే సంబంధిత షాపులో కొనుగోలు చేసినట్లు బిల్లు తీసుకోవడం మరువకూడదు. అనంతరం ఏదైనా తేడా వచ్చినట్లు తెలిస్తే.. సదరు బ్రాండ్‌ షోరూం నుంచి లెటర్‌ తీసుకుని మా వద్దకు వస్తే వినియోగదారుల ఫోరానికి అప్పజెబుతాం. ఖర్చు లేకుండా కేసు వేయవచ్చు. వస్తువల కొనుగోళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
>
> – సురేశ్‌కుమార్‌, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి

నేడు మడకశిర అభివృద్ధిపై సమీక్ష సమావేశం

- హాజరుకానున్న మంత్రి జయరామ్‌
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



టీటీడీ కల్యాణ మంటపంలో సమీక్ష సమావేశానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం

మడకశిర: రాష్ట్ర కార్మికశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ శుక్రవారం తొలిసారిగా మడకశిరకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకు పట్టణంలోని వైఎస్సార్‌ సర్కిల్‌కు మంత్రి చేరుకుంటారు. వైఎస్సార్‌ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నారు. అనంతరం టీటీడీ కల్యాణ మంటపంలో జరిగే మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తామన్నారు. మంత్రి జయరామ్‌ పర్యటన నేపథ్యంలో ఘన స్వాగతం పలకడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

నివేదికలతో హాజరు కావాలి

మడకశిరలో శుక్రవారం నిర్వహించే నియోజకవర్గ అభివృద్ధి సమీక్ష సమావేశానికి మంత్రి జయరామ్‌ హాజరుకానుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్‌ ముష్రావలి తెలిపారు. టీటీడీ కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే తిప్పేస్వామితో పాటు కలెక్టర్‌, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు సమీక్షలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల అన్ని శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను తహసీల్దార్‌ ముష్రావలితో పాటు ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం





మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు గొండు సీతారాం, హాజరైన ఐసీడీఎస్‌ అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్‌: బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు డాక్టర్‌ గొండు సీతారాం , ఆదిలక్ష్మి త్రిపర్ణ, పద్మావతి తెలిపారు. గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషన్‌ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ ప్రతి యేడు దేశ వ్యాప్తంగా వేలాది మంది బాలికలు బాల్య వివాహాల బారిన పడుతున్నారని తెలిపారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకొని తల్లులుగా మారుతుండటంతో అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే మాతృ మరణాల సంఖ్య కూడా పెరిగిపోతోందన్నారు. అందువల్ల బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ అండగా ఉంటుందన్నారు. బ్యాడ్‌ టచ్‌, గుడ్‌ టచ్‌ పై బాలికలకు విస్తృతంగా అవగాహన పెంచాలన్నారు. జిల్లాలో 2022–23 సంవత్సరంలో నమోదైన బాల్య వివాహాలపై పోలీస్‌స్టేషన్లలో ఎన్ని ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు? బాల్య వివాహాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కమిషన్‌ సభ్యులు ఆదిలక్ష్మి త్రిపర్ణ, పద్మావతి మాట్లాడుతూ జాతీయ కుటుంబ సంక్షేమశాఖ అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో బాల్య వివాహాల సగటు 29.3 శాతం ఉండగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 37.3 శాతంగా ఉందన్నారు. ఇందులో 13.6 శాతం మంది గర్భిణులు అయినట్లు అధికారిక నివేదికలు తేటతెల్లం చేస్తుండడం విచారకరమన్నారు. బాల్య వివాహాలను ఎవరు ప్రోత్సహించినా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ పీడీ లక్ష్మీకుమారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఆ తర్వాత బుక్కపట్నం డైట్‌ కళాశాలలో జిల్లాలోని 32 మండలాల ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై ఆగ్రహం

మండలంలోని బ్రాహ్మణపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు పరిశీలించారు. హాజరు పట్టిక సక్రమంగా ఉంచలేదని, ఫుడ్‌ పుస్తకంలో కొట్టి వేతలు ఉన్నాయని, గుడ్లు అధికంగా ఉన్నాయని అంగన్‌వాడీ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కేంద్రంలోనే ఇన్నితప్పులు ఉంటే అన్ని కేంద్రాలు ఎలా ఉన్నాయో అనే అనుమానం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌, ఎస్పీలతో సమావేశం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ బృందం సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ అరుణ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. బాలల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డితోనూ సమావేశమయ్యారు.

'పది'లో వందశాతం ఫలితాలు రావాలి

- ఎంఈఓ, హెచ్‌ఎంలతో కలెక్టర్‌ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్‌ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్‌: 'ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయండి. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలను కచ్చితంగా తనిఖీ చేసి నివేదికలు అందించండి' అని కలెక్టర్‌ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, బడి మానేసిన పిల్లలు, విద్యా కానుక, నాడు–నేడు, 10వ తరగతిలో వంద శాతం ఫలితాలపై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌ స్కూళ్ల కన్నా బాగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీని ఫలితంగా డ్రాపౌట్స్‌ సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 10వ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. మడకశిర, హిందూపురం, సోమందేపల్లి, బుక్కపట్నం, పరిగి, కదిరి, గోరంట్ల, ముదిగుబ్బ మండలాల ఎంఈఓలు పని తీరు మెరుగుపరుచుకోవాలన్నారు. చేసే పని మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సాంకేతిక పద్ధతులు అలవాటు చేసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్నారా? లేదా అనే విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ డీఈఓ రంగస్వామి, అన్ని మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేసేలా చర్యలు

జిల్లాలో పీఎం కిసాన్‌కి సంబంధించి రైతుల ఈ–కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. గురువారం అమరావతి నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, టవర్లకు భూ కేటాయింపు, స్పందన గ్రీవెన్స్‌, డెయిరీల అభివృద్ధి, హౌసింగ్‌ ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పీఎం ఈ కేవైసీ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని , ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వేను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ కొండయ్య తదితరులు ఉన్నారు.

3న పర్యాటక స్థలాల లీజుకు వేలం

పుట్టపర్తి టౌన్‌: జిల్లాలోని పర్యాటక స్థలాలను అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు లీజుకు ఇస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తిమ్మమ్మ మర్రిమాను, ననసకోట దుర్గమ్మ గుడి వద్ద పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఉన్న నిర్మాణాలను లీజుకు అప్పగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే కలెక్టరేట్‌లో ఆగస్టు 3న 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు తిమ్మమ్మ మర్రిమానుకు రూ. 5 వేలు, ననసకోట దుర్గమ్మ ఆలయానికి రూ.3 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. లీజు దక్కించుకున్నవారు వారం రోజుల్లోపు ఒక సంవత్సరం లీజుకు సంబంధించిన మొత్తాన్ని 'టూరిజమ్‌ కౌన్సిల్‌ ' పేరు మీద డీడీ తీసి ఒప్పందపత్రం తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఫోన్‌ నంబర్‌ 9121144085ను సంప్రదించాలన్నారు.

జోరుగా.. హుషారుగా...

హిందూపురం: జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం పట్టణంలోని ఎంజీఎం మైదానంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని జెడ్పీ హైస్కూల్స్‌, కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 100, 200, 400 మీటర్స్‌ పరుగు పందెంతో పాటు రిలే, షాట్‌ పుట్‌, లాంగ్‌జంప్‌ తదితర పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఆర్డీటీ సిబ్బంది, పీఈటీలు

ఒకరికివ్వాల్సిన ప్రమోషన్‌ మరొకరికి!

- సీనియర్‌ అసిస్టెంట్‌పై సస్పెన్షన్‌ వేటు

రాప్తాడురూరల్‌: పదోన్నతుల జాబితాలో సిబ్బంది మతలబు చేశారు. సీనియర్‌ టీచరు పేరును జాబితాలో చేర్చకుండా జూనియర్‌కు పదోన్నతి కల్పించారు. సీనియర్‌ అడ్డుచెప్పడంతో రాత్రికి రాత్రి ఆమెకు మార్చారు. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన డీఈఓ సాయిరాం సీనియర్‌ అసిస్టెంట్‌పై సస్పెన్షన్‌ వేటు వేశారు. వివరాలు.. ఎస్‌ఏ (గణితం) పదోన్నతుల కౌన్సెలింగ్‌ ఈనెల 6న జరిగింది. సీనియార్టీ జాబితాలో తనకల్లు మండలంలో పని చేస్తున్న ప్రభావతి పేరు లేదు. ఆ తర్వాత పేరు ఉన్న బి.సురేఖ కౌన్సెలింగ్‌కు హాజరై ప్రమోషన్‌ తీసుకుని విరుపాపల్లి ఎంపీయూపీఎస్‌ కోరుకున్నారు. సంతకం చేసి వెళ్లిపోయారు. అయితే, సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రభావతి డీఈఓ కార్యాలయ సిబ్బంది వద్దకు వచ్చారు. తనపేరు లేకుండా జూనియర్‌ పేరును ఎలా చేర్చారని ప్రశ్నించారు. దీంతో సురేఖకు ఫోన్‌ చేసి ప్రమోషన్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రభావతికి ఇచ్చి పంపారు. ఈ విషయం డీఈఓకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. తర్వాత రోజు డీఈఓను కలిసిన సురేఖ.. సీనియార్టీ జాబితాలో పేరులేని, కౌన్సెలింగ్‌కు హాజరుకాని టీచరుకు ఎలా ప్రమోషన్‌ ఇస్తారని వాపోయారు. వాస్తవంగా సీనియర్‌గా ఉన్న వారికే ప్రమోషన్‌ ఇవ్వాల్సి ఉంటుందని డీఈఓ చెప్పారు. సీనియార్టీ జాబితా తయారు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన డీఈఓ విధుల పట్ల అలసత్వం ప్రదర్శించినట్లు గుర్తించి సీనియర్‌ అసిస్టెంట్‌ ప్రదీప్‌కుమార్‌ను సస్పెండ్‌ చేస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్‌: 'ఇంటింటి సర్వేతో తప్పులు లేకుండా తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రచురించడానికి చర్యలు చేపడుతున్నాము. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇందుకు సహకరించాలి' అని కలెక్టర్‌ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌–2024పై డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్‌ కలెక్టర్‌ కార్తీక్‌తో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో 1555 పోలింగ్‌ స్టేషన్లు ఉండగా ప్రతి పోలింగ్‌ స్టేషన్‌కు ఒక బీఎల్‌ఓను నియమించినట్లు తెలిపారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ ఇంటింటి సర్వేలో ఓటర్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, తొలగింపు చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బూత్‌లెవల్‌ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అక్టోబర్‌ 17న సమగ్ర ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. నవంబర్‌ 30 వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్‌ 28, 29 , నవంబర్‌ 18,19 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌ 26 నాటికి క్లెయిములను పరిష్కరిస్తామని, 2024 జనవరి 5న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. 01.01.2024 నాటికి 18 సంవత్సరాలు వయసు ఉన్న యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం, కదిరి, హిందూపురం, పుట్టపర్తి మడకశిర ,పెనుకొండ ఎన్నికల అధికారులు తిప్పేనాయక్‌, రాఘవేంద్ర, సవరయ్య, భాగ్యరేఖ, చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు మహదేవనాయుడు, సీపీఎం నాయకులు గంగాధర్‌, సీపీఐ నాయకులు అంజి, బీఎస్పీ నాయకులు సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, బీజేపీ నాయకులు బాలగంగాధర్‌, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు మైనుద్దీన్‌, నరసింహులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం కేంద్రంగా గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు పోలీసులకు పట్టుబడ్డారు. మరొకరు పరారీలో ఉన్నారు. వివరాలను గురువారం సీఐ సుబ్బరాయుడు వెల్లడించారు. పాలసముద్రం గ్రామ సమీపంలోని ఓ హోటల్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బిహార్‌కు చెందిన మాధవ్‌కుమార్ అలియాస్ బిషాల్, గౌతమ్‌కుమార్, రామ్‌ప్రీత్‌దాస్, పశ్చిమ బెంగాల్ నివాసి ప్రకాష్‌శర్మ, పెనుకొండ నివాసి ఇలియాజ్ గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. విచారణలో కొంత కాలంగా పాలసముద్రంలోని ఫైన్ టోవెల్స్ కంపెనీలో మాధవ్‌కుమార్, గౌతమ్‌కుమార్ పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. వీరిద్దరూ బెంగళూరు నుంచి బిహార్‌కు చెందిన తమ స్నేహితుడు మనీష్‌కుమార్ ద్వారా గంజాయి తీసుకువచ్చి పాలసముద్రం క్రాస్‌లోని ఓ హోటల్ పని చేస్తున్న రామ్‌ప్రీత్‌దాస్, ప్రకాష్‌శర్మ, ఇలియాజ్ ద్వారా వినియోగదారులకు విక్రయించేవారిగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి, 850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మనీష్‌కుమార్ కోసం గాలిస్తున్నారు.

గుండెకు సూపర్ చికిత్స

- ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ అద్భుత సేవలు
- అందుబాటులో రూ.కోట్లు విలువ చేసే పరికరాలు
- ప్రాణాపాయ కేసులు విజయవంతం చేస్తున్న వైద్యులు
- రూ.లక్షలతో కూడుకున్న శస్త్రచికిత్సలు పూర్తి ఉచితం

అనంతపురం క్రైం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్య రంగంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వాస్పత్రులను పటిష్టం చేస్తూ పేదలు, మధ్య తరగతి ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. ఈ క్రమంలోనే అనంతపురం కేంద్రంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేస్తూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఈ ఆస్పత్రి మెట్లు ఎక్కిన రోగి కొన్ని రోజుల వ్యవధిలోనే సంపూర్ణంగా కోలుకుని ఎంతో సంతోషంగా ఇంటి బాట పడుతుండడం గమనార్హం.

కార్డియాలజీలో విస్తృత సేవలు

ఉమ్మడి జిల్లాలో మరే ఆస్పత్రిలోనూ లేని విధంగా ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగానికి అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. సూపర్ స్పెషాలిటీలో గతేడాది ఏప్రిల్‌లో ఓపీ, అదే ఏడాది జూన్‌లో ఐపీ సేవలు మొదలయ్యాయి. రూ.లక్షలతో కూడుకున్న ఖరీదైన శస్త్రచికిత్సలు ప్రజలకు ఉచితంగా అందజేసేలా గత ఏడాది డిసెంబర్ 21న క్యాథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందు కోసం రూ.6.5 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. అలాగే రూ.2 కోట్ల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన పది పడకల ఐసీయూ, 20 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో ఇప్పటి వరకూ 300లకు పైగా ఆంజియోప్లాస్టీ, యాంజోగ్రామ్ తదితర శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఇందులో 70 మందికి ఆంజియోప్లాస్టీ చేసి 94 స్టంట్లు వేశారు. ఈ తరహా శస్త్రచికిత్సకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు అంటున్నారు. వీటితోపాటు 250 వరకూ ఆంజియోగ్రామ్ ప్రక్రియలు జరిగాయి. రూ.1.2 కోట్ల విలువ చేసే వీవీడ్‌ఈ95 2డీ ఎకో పరికరం అందుబాటులోకి తీసుకురావడంతో ఇప్పటి వరకూ 9వేల మందికి ఎకో పరీక్షలు చేశారు. ప్రైవేట్‌గా ఒక్క 2డీ ఎకో పరీక్ష చేయాలంటే రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తారు. గుండె పోటుకు గురైనప్పుడు గుండెలోని రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టే పరిస్థితులుంటాయి. అప్పుడు థ్రాంబొలైసిస్ వంటి థెరపీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఒక్క వైల్ రూ.40వేలు విలువ చేసే ఎలాక్సియమ్ అనే ఇంజెక్షన్ అందుబాటులో ఉంచారు. ఇలాంటి థెరపీలు ఇప్పటి వరకూ వందకు పైగా వైద్యులు చేశారు. అలాగే తాత్కాలిక పేస్‌మేకర్, పెరీకార్డియోసెంటిసిస్ (గుండె చుట్టూ నీరు చేరడం) సేవలూ అందుబాటులో ఉన్నాయి. బీపీ తక్కువగా ఉండి చెమటలు పట్టడం, కళ్లు తిరగడం, తదితర సమస్యతో ఉన్న వారికి సేవలందించేందుకు రూ.30 లక్షలు విలువ చేసే ఇంట్రా అయోర్టిక్ బలూన్‌పంప్ అందుబాటులో ఉంది.


ఈ వృద్ధురాలి పేరు బయమ్మ. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం సామచేనుబయలు గ్రామం. గుండె సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్న ఆమెను ఈ నెల 8న అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుమారుడు శ్రీనివాసులు పిలుచుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఆమె గుండె రక్తనాళాల్లో బ్లాక్ ఏర్పడిందని, శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, ఈ నెల 11న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ నేతృత్వంలో ఈ నెల 13న ఆమెకు శస్త్రచికిత్స చేసి స్టంట్ వేశారు. ప్రధాన నగరాల్లో ఇదే శస్త్ర చికిత్సకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే నయాపైసా చెల్లించకుండానే బయమ్మకు వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.


ఇతని పేరు ఎస్.అన్వర్ బాషా. గుమ్మఘట్ట గ్రామం. గుండె సంబంధిత సమస్యతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. దీంతో అతని గుండె పనితీరును గుర్తించేందుకు ఓ హోల్టర్ పరికరాన్ని అమర్చి 24 గంటలూ అతని గుండె చప్పుడుని రికార్డ్ చేశారు. గుండెలో వచ్చే అబ్‌నార్మల్ రిథమ్స్ తెలుసుకునే సౌలభ్యం కేవలం ఈ ఆస్పత్రిలోనే ఉండడం గమనార్హం.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ సేవలు ఇలా..

ఓపీ సేవల ప్రారంభం	2022, ఏప్రిల్
ఐపీ సేవల ప్రారంభం	2022, జూన్
క్యాథ్‌ల్యాబ్ సేవల ప్రారంభం	2022, డిసెంబర్ 21 నుంచి

గడిచిన 8 నెలల్లో సాధించిన పురోగతి

యాంజియోప్లాస్టీ(స్టంట్లు) శస్త్రచికిత్సలు	70
యాంజోగ్రామ్స్ చికిత్స	250

అన్ని సేవలు ఉచితమే


పేద, మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన కార్డియాక్ సేవలు సూపర్ స్పెషాలిటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ ఉంటుంది. మిగిలిన రోజుల్లో సమస్యను బట్టి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తక్షణమే ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నాం.
–డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజీ విభాగాధిపతి

మంచి ఫలితాలు సాధిస్తున్నాం


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అన్ని విభాగాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి గుండెకు సంబంధించి సేవలు మొదలయ్యాయి. ప్రభుత్వ సహకారంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.
– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే తోపుదుర్తి, నాగరాజు



రాప్తాడు రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఇటీవలే వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీ నాయకుడు పోతుల నాగరాజు కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు.

బాలిక అదృశ్యం


ప్రియదర్శిని

పుట్టపర్తి టౌన్: మండలంలోని కంబాలపర్తికి చెందిన శ్రీనివాసులు కుమార్తె ప్రియదర్శిని (16) కనిపించడం లేదు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేసినట్లు కొత్తచెరువు ఎస్ఐ లింగన్న తెలిపారు. అనంతపురంలోని వివేకానంద కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రియదర్శిని ఈ నెల 7న సెలవులకు స్వగ్రామానికి చేరుకుంది. ఈ నెల 19న అనంతపురానికి వెళ్లేందుకు ఉదయం 10 గంటలకు కొత్తచెరువు బస్టాఫ్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో కుమార్తెకు అవసరమైన మందులు కొనేందుకు తండ్రి శ్రీనివాసులు పక్కనే ఉన్న మెడికల్ స్టోర్‌కు వెళ్లారు. తిరిగి బస్టాఫ్ వద్దకు చేరుకునే సరికి బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు గాలించినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96838కు సమాచారం అందించాలని కోరారు.

జేసీబీ దొంగల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెనుకొండ: జేసీబీని అపహరించుకెళ్లిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ హుస్సేన్ పీరా వెల్లడించారు. పరిగి మండలం కొడిగేపల్లి వద్ద ఓ ప్రైవేట్ లే అవుట్‌లో వెంకటశివారెడ్డికి చెందిన జేసీబీతో నిర్వాహకులు పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి పూట జేసీబీని లే అవుట్‌లోనే వదిలి వెళ్లేవారు. ఈ విషయాన్ని గుర్తించిన కర్ణాటకలోని నగిరిగేరి తాలూకా తొక్కలహళ్లికి చెందిన అభిలాష్, సురేంద్ర, ప్రశాంత్, చిన్నపరెడ్డి ఈ నెల 12న రాత్రి జేసీబీని అపహరించుకెళ్లారు. ఘటనపై జేసీబీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించి, గురువారం పరిగి మండలం మోదా సమీపంలో ప్రశాంత్, చిన్నపరెడ్డిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి జేసీబీతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పక్కా రిజిస్ట్రేషన్‌తో ఉపయోగకరం

పుట్టపర్తి: స్థిరాస్తులు, ఇతర అంశాలను పక్కాగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం చాలా ఉపయోగకరమని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి పేర్కొన్నారు. బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ఆవశ్యకత, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పారిశ్రామిక వేత్తల సహకారంతో కళాశాలల ఆధునికీకరణ

- సీడాప్ సీఈఓ శ్రీనివాసులు


మాట్లాడుతున్న శ్రీనివాసులు

అనంతపురం: జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు సహకరించాలని పారిశ్రామికవేత్తలకు సీడాప్ సీఈఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఆధునిక ల్యాబ్‌లు, ఆధునిక బోధనా పద్ధతులు, పరిశ్రమలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, స్టేట్ మిషన్ మేనేజర్ విజయ, జేడీఎం సూర్యనారాయణ, డీఎస్‌డీఓలు రాజ్‌కుమార్, అబ్దుల్‌ఖయ్యూం పాల్గొన్నారు.

చరిత్ర సృష్టిస్తున్న 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే శంకరనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్రంలో చరిత్ర సృష్టిస్తోందని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను మరింత చేరువ చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాల లబ్ధిని చేకూరుస్తున్నారన్నారు. ప్రతి కుటుంబం శ్రేయస్సే లక్ష్యంగా ప్రతి వలంటీరూ నిబద్ధతతో పని చేస్తూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాక, వారికి ఉచితంగా పలు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేయడంలో సీఎం వైఎస్ జగన్ నిబద్ధత, అంకితభావం, సమర్థతను జగనన్న సురక్ష కార్యక్రమం నిరూపిస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శ్రమిస్తున్న వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని రాబోవు రోజుల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరాయుడు, వెంకటరత్నం, మునిమడుగు శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, కంబాలప్ప, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ధర్మవరం రూరల్: ఈ నెల 7న మండలంలోని రావులచెరువు నివాసి సాకే ఆదినారాయణ ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ వివరాలను ఎస్ఐ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఉదయం గొట్లపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో వచ్చిన కారును ఆపి రికార్డులు పరిశీలించారు. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన నామ్మే రామాంజనేయులు, శాంతి నగర్ నివాసి శేషం మణికుమార్ పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో సాకే ఆదినారాయణ ఇంట్లో చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించడంతో ఇద్దరినీ అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.80 వేలు నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న గొట్లూరు నివాసి గణేష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆరోహణరావు అభినందించారు.

భార్య కనిపించడంలేదని ఫిర్యాదు

బత్తలపల్లి: గత మూడు రోజులుగా తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఓ భర్త ఫిర్యాదు చేశాడు. వివరాలు.. బత్తలపల్లిలో వాటర్ సర్వీసు సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న షేక్ అబ్దుల్ ఖాదర్‌కు అనంతపురం జిల్లా తరిమెలకు చెందిన షేక్షావలి రెండో కుమార్తె సల్మాతో ఈ నెల 6న వివాహమైంది. ఈ కొన్ని రోజులూ ఇద్దరూ అన్యోన్యంగానే ఉన్నారు. గత సోమవారం మధ్యాహ్నం అబ్దుల్ ఖాదర్ మసీదుకు వెళ్లి ఇంటికి చేరుకున్న సమయానికి భార్య కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఉరవకొండ: స్థానిక వడ్డే వీధికి చెందిన ఉప్పర సోమనాథ్ (38) గురువారం రాప్తాడు సమీపంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ధర్మవరం నుంచి గుత్తికి బదిలీపై వెళ్లిన ఆయన డిప్యూటేషన్‌పై ఉరవకొండలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమనాథ్‌కు భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు


రికార్డులు పరిశీలిస్తున్న పీఆర్‌సీ బృందం సభ్యులు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు గతంలో కంటే ఇప్పుడు మెరుగుపడ్డాయని, మౌలిక వసతుల కల్పన కూడా సంతృప్తికర స్థాయిలో ఉన్నాయని కేరళకు చెందిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సీ) బృందం సభ్యుడు సురేష్‌కుమార్ అన్నారు. గురువారం కొత్తచెరువులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కేరళ బృందం సందర్శించింది. ఈ బృందానికి డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ ద్వారా అందుతున్న సేవలపై సభ్యులు ఆరా తీశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు, ఆస్పత్రిలోని సౌకర్యాలు పరిశీలించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఉన్న సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించి, అందుతున్న వైద్య సేవలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం, వైద్య సేవలు మెరుగు పరచడం తదితర ప్రభుత్వ చర్యలతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాధ, డాక్టర్ అశ్వత్థకుమార్, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జోయల్ వెస్లీ, డాక్టర్ హారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వ సాయం

హిందూపురం: గుండెపోటుతో మృతి చెందిన స్థానిక ఆర్టీసీ బస్సు డ్రైవర్ రాజేంద్ర కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6 లక్షల ఆర్థికసాయం చెక్‌ను బాధిత కుటుంబసభ్యులకు ఇన్‌చార్జి డీఎం హంపన్న అందజేశారు. ఇటీవల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో రాజేంద్ర మృతి చెందిన విషయం తెలిసిందే. కుమారుడు వైకల్యంతో బాధపడుతున్నాడు. కుటుంబపోషణకు భార్య తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వ సాయంతో పాటు ఆర్టీసీ నుంచి అందాల్సిన సదుపాయాలు వెంటనే మంజూరు చేయాలంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు విన్నపం మేరకు అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు.